ఈరోజు (13 అక్టోబర్) యం.బి.విజ్ఞానకేంద్రంలో జరిగిన వామపక్షాల రాష్ట్ర సదస్సులో ఈ క్రింది తీర్మానాన్ని ఆమోదించారు. సదస్సులో సిపియం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఫార్వర్డ్‌బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి పి.వి.సుందరరామరాజు, ఆర్ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జె.జానకి రాములు, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు డి.హరినాథ్, సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకులు జె.కిషోర్‌బాబు, ఎంసిపిఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యులు ఉయ్యాల శ్రీనివాసరావులు ఉపన్యసించారు. ఈ సదస్సుకు సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు ఆహ్వానం పలకగా సిపిఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ వందన సమర్పన చేశారు. ప్రచురణార్థం విడుదల చేస్తున్నాం. – జె.ప్రభాకర్, 9490098433

## కార్పోరేట్లకు వరాలు - సామాన్యులపై భారాలు
## బిజెపి విధానాలను నిరసిస్తూ
## వామపక్షాల రాష్ట్ర సదస్సు - 13 అక్టోబర్, 2019 - విజయవాడ

# తీర్మానం

## అక్టోబర్ 10–16 దేశవ్యాపిత నిరసనల్లో పాల్గొనండి –
## 16న రాస్తారోకో జయప్రదం చేయండి.

భారతదేశంలో కార్లే కాదు బిస్కెట్లు కూడా అమ్ముడు పోవడం లేదు. పనులు తగ్గి డిమాండ్ పడిపోయింది. పరిశ్రమలు ఉత్పత్తిని తగ్గించుకుంటున్నాయి. ఉద్యోగులను తొలగిస్తున్నాయి. నిరుద్యోగం 50 ఏళ్ళనాటి స్థితిని దాటింది. రైతులు, కార్మికులు, గ్రామీణ పేదలు ఆందోళనలో ఉన్నారు. మహిళల పరిస్థితి మరీ దారుణంగా వుంది. మాంధ్యం ఇంతకు ముందెన్నడూ లేని స్థాయికి చేరింది.

మోడీ తీసుకున్న పెద్దనోట్ల రద్దుకు తోడు జిఎస్టీతో ఉత్పత్తి పడిపోయింది. చిన్న పరిశ్రమలు, చిన్న చిన్న వ్యాపారాలు దెబ్బతిని లక్షల మందికి ఉద్యోగాలు పోయాయి. కొనుగోలు శక్తి దెబ్బతిన్నది. ప్రజలు డబ్బులు లేక అల్లాడుతుంటే మోడీ ప్రభుత్వం కార్పోరేట్లకు పన్నులు 30 నుండి 25 శాతానికి తగ్గించి ఒక్క దెబ్బతో 1.45 లక్షల కోట్ల రాయితీలు కార్పోరేట్లకు కట్టబెట్టింది. ఈ లోటును పూడ్చుకోవడానికి కొత్త పన్నులు తప్పవేమోనన్న ఆందోళన బయలుదేరింది.ఈ నేపధ్యంలో వ్యవసాయం, ఉపాధి లాంటి రంగాలతో పాటు రోడ్లు, వంతెనలు లాంటి మౌలిక సదుపాయాలుకు ప్రభుత్వ రంగ పెట్టుబడులు పెంచి ప్రజల ఆదాయాలు పెంచాలి. కానీ కార్పోరేట్లకు మోడీ ప్రభుత్వం వరాలిచ్చింది. ఇది పూర్తి ప్రజావ్యతిరేక చర్య. ప్రతిఘటన పెరుగుతుంటే మతం, కులం, భాష తదితర రూపాల్లో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తుంది. హిందీని జాతీయ బాషగా ప్రకటించడం, బిజెపి రాష్ట్రాల్లో ఎన్ఆర్‌సి కావాలని ప్రజల మధ్య చిచ్చుకు పూనుకుంటోంది.

ఆటోమొబైల్ పరిశ్రమ సంక్షోభానికి గురైతే దానిపై ఆధారపడ్డ 4కోట్ల మంది జీవితాలు అతలాకుతలమయ్యాయి. 17 కార్ల పరిశ్రమలకు గాను 10 పరిశ్రమలు అమ్మకాలు పుర్తిగా తిరోగమనం పాలయ్యాయి. ఉత్పత్తి తగ్గించడం, 10 లక్షల మంది కార్మికుల్ని కంపెనీలు తొలగించడం ఇప్పటికే జరిగి పోయింది. ప్రైవేటు రంగం ఈ రీతిగా కుదేలవుతుంటే, ప్రభుత్వరంగంలో, భారీ స్థాయి ప్రైవేటీకరణని ప్రభుత్వం ప్రకటించింది. నూరు శాతం ఎఫ్‌డిఐ అనుమతించిన రక్షణ రంగంలో 4 లక్షల మంది పనిచేస్తున్న 42 ఉత్తత్తి కేంద్రాలు ప్రైవేటుపరం చేస్తున్నట్లు ప్రకటించింది. ఇంతకు ముందే 6 విమానాశ్రయాలను ప్రైవేటు వారికి ఇవ్వగా, ఇప్పుడు 25 విమానాశ్రయాలతో పాటు, రైల్వే రంగం, కేంద్ర ప్రభుత్వ పరిశ్రమల రంగంలోని 49 శాతం ప్రైవేటీకరణ చేస్తున్నట్లు ప్రకటించింది. ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ పై అన్ని రంగాల్లో ఉపాధి పోయి కోట్లాది మంది రోడ్డున పడుతున్నారు. 27ప్రభుత్వ రంగ బ్యాంకుల మూసివేత 12కు చేరి అనేక బ్రాంచిలు మూతబడి వేలాది మంది ఉపాది కోల్పోతున్నారు. పరపతి సౌకర్యం ప్రజలకు దూరం అవుతుంది. 2018–19 సంవత్సరంలో బ్యాంకుల్లో ఉన్న 1.96 లక్షల కోట్ల రూపాయలు కార్పోరేట్ల మొండి బకాయిలు రద్దు చేయగా, ఈ సంవత్సరం మళ్ళీ 2.38 లక్షల కోట్ల రూపాయలు కార్పోరేట్ల మొండి బకాయిల బ్యాంకుల లెక్కల్లో తేలాయి.

దీనికి తోడు మోడీ సర్కార్ నిన్న ఆగస్టు 5న రెండో విడత బ్యాంకుల విలీనీకరణలో భాగంగా ఆంధ్రా బ్యాంకును ఎత్తివేసి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విలీనం చేసింది. 96 సంవత్సరాల చరిత్ర కల్గిన, జాతీయోద్యమ స్ఫూర్తిగా భోగరాజు పట్టాభి సీతారామయ్యగారి చొరవతో ఏర్పడిన ఈ బ్యాంకును ఎత్తివేయటం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేస్తున్నారు. బి.జె.పి. ఎన్నికల లబ్ధిలో భాగంగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రను, బ్యాంక్ ఆఫ్ బరోడాను, పంజాబ్ & సింధ్ బ్యాంకుల అస్థిత్వాన్ని కాపాడుతూ ఆంధ్ర ప్రజలకు ఉన్న ఏకైక బ్యాంకును ఎత్తివేయడం మరో దారుణం. గతంలో ఆంధ్రప్రదేశ్‌కు 5 సం॥లపాటు ప్రత్యేక హోదా ఇస్తామని, ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని, పోలవరానికి, రాజధాని అమరావతికి నిధులు సమకూర్చుతామని, లోటు బడ్జెట్‌ను పూడ్చుతామని, కడపలో స్టీల్ ప్లాంట్, విశాఖలో రైల్వే జోన్ ఇస్తామని మోసం చేశారు.

ప్రజల కొనుగోలు శక్తి పెంచడం ద్వారానే వస్తు తయారీ రంగం, పారిశ్రామిక రంగంలో కదలిక తీసుకు రాగలుగుతామనే వాస్తవాన్ని మోడీ ప్రభుత్వం విస్మరించింది. అధికారాన్ని అడ్డం పెట్టుకొని రిజర్వు బ్యాంకు నిధుల నుండి తీసుకున్న 1.76 లక్షల కోట్ల రూపాయలను ప్రభుత్వం వ్యవసాయం, పరిశ్రమలకు ఖర్చు పెట్టడం ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి కల్పించవచ్చుననే వాస్తవాన్ని విస్మరించింది. కార్పోరేట్లకు దారాదత్తం చేస్తుంది. బిజెపి ప్రభుత్వానికి మిగిలిన దేశభక్తి ఇది.

మరోవైపు ప్రభుత్వ విధానాలతో బలవుతున్న తరగతులు ఆందోళనకు దిగుతున్నాయి. సెప్టెంబరు ఆఖరులో రక్షణ, మైనింగ్ రంగాల్లోని కార్మికులు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పెద్దయెత్తున సమ్మెలు చేసి ప్రభుత్వాన్ని నిలేశారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అక్టోబరు 10 నుండి 16 వరకు దేశవ్యాప్తంగా జరిగే ఆందోళనల్లో ప్రజలంతా కలిసి రావాలని వామపక్షాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. అక్టోబరు 16వ తేదీన రాష్ట్రంలో ఎక్కడికక్కడ రాస్తారోఖోలు తదితర రూపాల్లో నిరసనలు తెలపాలని కోరుతున్నాము.

**డిమాండ్లు :**

**(1)** కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ప్రభుత్వ పనులకు పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు చేయాలి.

**(2)** ప్రతి కార్మికునికి కనీస వేతనం నెలకు రూ.21 వేలు ఇవ్వాలి.

**(3)** తీసివేసిన కార్మికులకు నెలసరి కనీస జీవన భృతి కల్పించాలి.

**(4)** ప్రభుత్వం రంగం ప్రయివేటీకరణ నిలిపివేయాలి. 100% విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి డిఫెన్సు, రైల్వే, ఎయిర్ ఇండియాలో వాపసు తీసుకోవాలి. ఆర్డినెన్సు ఫ్యాక్టరీలు, బిఎస్ఎన్ఎల్, రైల్వేలు, ఎయిర్ ఇండియాల్లో ప్రయివేటీకరణ నిలిపివేయాలి.

**(5)** మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో బకాయిలు చెల్లింపుకు నిధులు విడుదల చేయాలి. సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలి.

**(6)** రైతుల ఆత్మహత్యలు నిరోధించేందుకు రైతుల రుణమాఫీ చేయాలి. రైతు పండించిన పంటకు ఒకటిన్నర రెట్లు ధర నిర్ణయించి గిట్టుబాటు ధరలు కల్పించాలి.

**(7)** దేశమంతా వృద్ధాప్య పెన్షనును మరియు విడో పెన్షనును రూ.3000లకు పెంచాలి.

= = = =